# తోడి కోడళ్ళు

-పొత్తూరి విజయలక్ష్మి

తెల్లవారుజాము. పక్షులు కిలకిల్లాడుతున్నాయి.

రాత్రంతా కలత నిద్రపోయిన అనసూయ లేచి కూర్చుంది. మంగళసూత్రాలు కళ్ళకి అద్దుకుంది. పక్కకి చూసింది. మాధవయ్య నిద్రలేచి చేతులు జోడించి దేవుడిని స్మరించుకుంటున్నాడు.

'ఇవ్వాళ శనివారం. బుధవారంనాడు వాళ్ళు వస్తారు. నేను తాపత్రయపడడం తప్ప మీకు చీమకుట్టినట్లయినా లేదు" అంది అనసూయ నిష్ఠూరంగా.

"ఇది నాకు సంబంధించిన విషయం కాదనీ నేను కలగజేసుకోననీ స్పష్టంగా చెప్పేశాను. నువ్వేం చేసుకుంటావో నీ ఇష్టం" అని చెప్పేసి 'మాధవా గోవిందా' అని దేవుడిని తల్చుకుంటూ పందిరి మంచం దిగాడు మాధవయ్య.

నిస్సహాయంగా చూసింది అనసూయ. ఆ వేళంతా పరధ్యానంగానే వుంది. ఆఖరు ప్రయత్నంగా పిల్లలని అడిగింది. వాళ్ళూ మేము కల్పించుకోము అనేశారు. వంటరిగా మిగిలిపోయింది అనసూయ. "ఎలా? ఏం చెయ్యను" అనుకుంది.

గోవిందయ్య మాధవయ్య అన్నదమ్ములు. ఇద్దరి ఇళ్ళూ ఎదురెదురుగా వుంటాయి. మధ్యలో రోడ్డు. గోవిందయ్య కరణం, మాధవయ్య ఉప కరణం. ఉద్యోగాలే కాక భూవసతి కూడా వుంది. ఆ గ్రామానికి వారిద్దరూ కొండంత అండ. వూరందరికీ వారి పట్ల ఎనలేని గౌరవం. అంతులేని అభిమానం.

గోవిందయ్య భార్య కామేశ్వరమ్మ. సన్నగా పచ్చగా పండిన తమలపాకులా వుంటుంది. శుచీశుభ్రత ఆవిడ పంచ ప్రాణాలు. లంకంత ఇల్లు, అరెకరం వున్న ఇంటి చుట్టూరా ఎప్పుడూ అద్దంలా వుండాలి. రాజుల దగ్గర అస్త్రశస్త్రాలలాగా ఆవిడ దగ్గర వివిధ రకాలైన చీపుళ్ళు, బూజు కర్రలూ వుంటాయి.

వాకిట్లో అరుగులు చిమ్మిన చీపురులే వరండా అరుగులు చిమ్మకూడదు. సావిడి చిమ్మే చీపురు వేరే. పడక గది చీపురు వేరే. పని మనిషి సుబ్బి దాని కూతురు రావులమ్మ దినం అస్తమానం ఇల్లు శుభ్రం చేస్తూనే వుంటారు.

చాకలి వీరాయి దొడ్లో చింతాకు కాసి రాట్లో దంచి దాంతో ఇత్తడి గిన్నెలు తోమి అరుగుమీద బోర్లిస్తే వీళ్ళింట్లో బంగారం పాత్రల్లో వండుకుంటారా అనుకుంటారు చూసినవాళ్ళు.

తెల్లారిన దగ్గర్నించి పొద్దు పోయే దాకా ఇంటి శుభ్రతే ఆవిడ ఏకైక లక్ష్యం. ఆమె సామాన్యంగా ఇల్లు వదిలి వెళ్ళదు. ఏ పెళ్ళి పేరంటమో అయితే మాత్రం వంటి నిండా నగలు పెట్టుకుని పట్టు చీరె కట్టుకుని లక్షణంగా వెళ్తుంది. అక్కడ పెద్దరికం వహిస్తుంది. కమ్మగా పాటలు పాడి ఆ శుభకార్యం పూర్తి చేయించి తిరిగి వస్తుంది.

ఇక అనసూయమ్మ. ఓ పిసరు రంగు తక్కువైనా కళగల మొహం. చెయ్యి నోరు కూడా పెద్దదే. పెట్టాల్సిన చోట పెట్టగలదు. తిట్టాల్సిన చోట తిట్టగలదు.

అక్కడ కామేశ్వరమ్మకు అపరాహ్ణం దాకా పని తెమలదు. ఇక్కడ అనసూయమ్మ మాత్రం పది గంటలకల్లా వంటా దేవతార్చనా మహా నైవేద్యం ముగించేసి భర్తకీ పిల్లలకీ, ఆ సమయానికి ఇంట్లో వున్న పిల్లల స్నేహితులకి కూడా అన్నాలు పెట్టేసి మంగళం పాడేస్తుంది.

హాల్లో ఉయ్యాల బల్ల మీద కూర్చుని ఆవేళ్టి దాకా, క్రిందటి రోజు దాకా పేపరు దొరక బుచ్చుకుని చదివి ఆ వార్తల మీద చర్చ జరుపుతుంది.

మధ్యాహ్నం కాసిని కాఫీ గొంతులో పోసుకుని ఊరి మీద బయలుదేరుతుంది. ఆవిడకు వైద్యంలో ప్రవేశం వుంది. ఆకు పసరులూ, హోమియో మందులూ మాత్రమే కాక అడపాదడపా

ఆయుర్వేద వైద్యం కూడా చేస్తుంది. ఆవిడనెవరూ పిలవక్కర్లేదు. ఎవరికైనా అనారోగ్యం అని తెలిస్తే ఆవిడే వెళ్తుంది.

మందులిస్తుంది. పిల్లాడిని అట్లా కటిక లంఖణాలు పెడితే ఇంకేమైనా వుందా? నీరసపడిపోడూ! కాస్త జావ కాచి పొయ్యండి అని మందలించి ఆ రోగి మంచీ చెడ్డా చూస్తుంది.

మళ్లీ సాయంత్రానికల్లా ఇంటికొచ్చేసి టీ కాచి వంట చేసేసి కళ్ళు చాచుకుని కబుర్లు చెప్తూ వుంటుంది.

గోవిందయ్య, మాధవయ్య ఇద్దరూ ఏ అరమరికలూ లేకుండా రామలక్ష్మణుల్లా కలిసి వుంటే ఈ తోటి కోడళ్ళిద్దరికీ బద్ధ వైరం. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. పెద్దలూ పిల్లలూ అందరూ నచ్చచెప్పి చూశారు. ఎంతమంది చెప్పినా వారి ధోరణి వారిదే అవడంతో విసుగేసి వూరుకున్నారు.

తెల్లవారి స్నానపానాలు సంధ్యా వందనం పూర్తి చేసుకుని తెల్లటి పంచ, చేతుల బనీను వేసుకుని ఉత్తరీయం భుజాన వేసుకుని వచ్చి వాకిట్లో అరుగుమీద కూర్చుంటాడు గోవిందయ్య.

రెండు నిముషాలు అటూఇటూగా తనూ వస్తాడు మాధవయ్య. "ఏం అన్నయ్యా స్నానం అయిందా?" అంటూ వచ్చి అన్నగారి పక్కన కూర్చుంటాడు. సంవత్సరాల తర్వాత కలుసుకున్నట్లు కడుపారా కబుర్లు చెప్పుకుంటారు.

ఊరివాళ్ళు రైతులూ ఎవరో ఒకరు ఏదో పనిమీద వస్తూనే వుంటారు. వారి మంచి చెడ్డలు విచారిస్తారు ఇద్దరూ. చిన్నా చితకా సమస్యలు పరిష్కరించడం అక్కడే. అయ్యా అమ్మాయిని కాన్పుకి తీసుకురావాలి మంచిరోజు చెప్పండి అంటే పంచాంగాలు తిరగేసి ముహూర్తం నిర్ణయించేదీ అక్కడే.

"వంటయింది మడి కట్టుకుంటారా?" అని ఇంట్లోంచి పిలుపు వచ్చేదాకా అక్కడే వుంటారు.

భోజనాలు చేసి విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్ళీ వాకిట్లోకి చేరతారు. సాయంత్రం దర్బారు మాధవయ్య అరుగుల మీద.

పిల్లలు ఆ ఇంటికీ ఈ ఇంటికీ ధారాళంగా తిరుగుతుంటారు.

చిన్నతనంలో అమ్మా పిన్నీ మాట్లాడుకోరేం అని అడిగేవాళ్ళు.

"ఏం చేస్తాం వాళ్ళ ఖర్మ, ఏనాడో ఏదో మాటామాటా అనుకున్నారు. ఇద్దరికిద్దరూ బిగుసుకుని కూర్చున్నారు'' అని చెప్పాడు గోవిందయ్య.

"ఏదైనా దెబ్బలాట అయిందా?" అంటే ఏదో పుట్టింటి పెట్టుబడుల గురించి మాటా మాటా వచ్చింది. అయినా తోటి కోడళ్ళ మధ్య మనస్పర్ధలకి కారణం కూడా కావాలా?" అనేశాడు తీరికగా.

క్రమంగా అదే అలవాటయిపోయింది. దశాబ్దం గడిచిపోయింది. గోవిందయ్య కూతురు శ్యామల పెళ్ళై పొరుగూళ్ళో వుంటోంది. ఆవిడ భర్త గవర్నమెంటు ఉద్యోగం. ఒక మారుమూల ప్రాంతానికి బదిలీ చేశారు. అక్కడ చదువులు బావుండవని ఇద్దరు పిల్లలని తండ్రి దగ్గర వుంచి స్కూల్లో చేర్పించింది. కొన్నాళ్ళక్కడ కొన్నాళ్ళిక్కడ అన్నట్టు వుంటుంది. శ్యామల కొడుకు బుద్ధిమంతుడు. కూతురు వరలక్ష్మి గడుగ్గాయి.

ఇద్దరు అమ్మమ్మలకీ పడదని తెలుసుకుని ఆ అవకాశాన్ని సొమ్ము చేసుకోవాలని ప్లాను వేసింది. రెండిళ్ళ వారికీ వరాలు అంటే చెప్పలేనంత ముద్దు.

అన్నం తిన్నాక చిన్నమ్మమ్మ పక్కలో జేరి "నువ్వు గయ్యాళావిడ కదా! పెద్దమ్మమ్మ చెప్పింది" అంటుంది. దానికి అనసూయ "నేనేం కాదు. ఆవిడే గయ్యాళిది. చుప్పనాతి శూర్పణఖ" అంటూ ఏవిటేవిటో చెప్తుంది.

అవన్నీ శ్రద్ధగా విని పొల్లు పోకుండా రాత్రి పూట కామేశ్వరి పక్కలో పడుకుని ఆవిడకి చెప్తుంది. "అవును పాపం! నేను చుప్పనాతిని. అదేమో శాంతమూర్తి. దాని సంగతి ఎవడికి తెలియదు'' అంటూ ఆవిడ అక్కసంతా బయటపెట్టుకునేది కామేశ్వరమ్మ.

పావురాయిలా సందేశాలు జేరవేస్తున్న కూతుర్ని పట్టుకుని నాలుగు తగిలించింది శ్యామల.

'పసిది. దాని తప్పేముంది? పెద్దవాళ్ళకి వుండాలి ఆ ఇంగితం!" అన్నాడు గోవిందయ్య.

"అది కాదు నాన్నా అసలే ఉప్పు నిప్పు వ్యవహారం. దానికి సాయం స(తకాయలా ఇదొకర్తి తయారయింది" అంది శ్యామల చిరాగ్గా.

'ఏం ఫర్వాలేదులే. వాళ్ళకీ కాలక్షేపం. దీనికీ కాలక్షేపం' అన్నాడాయన నవ్వుతూ.

ఆ మాటా నిజమే. అది వరకు ఆ తోటికోడళ్ళిద్దరికీ తమ అక్కసు తీర్చుకునే మార్గం వుండేది కాదు.

మగవాళ్ళిద్దరూ ఏ పొరుగూరో వెళ్ళినప్పుడు వాకిట్లో నుంచుని కనిపించిన మనిషిని దొరకబుచ్చుకుని "ఏవమ్మా బావున్నావా? చూసి చా(రోజులు అయింది. నాకేమో తీరికుండదు. అబడదిబడ పనులు నాకు నచ్చవు. ఎక్కడివక్కడ పారేసి మగరాయుడిలా పేపరు కాయితాలు చదివే అలవాటు నాకు లేదు తల్లీ" అనేది కామేశ్వరమ్మ.

వెంటనే అనసూయమ్మ వాకిట్లోకి వచ్చి "ఎవ(డా ఆ వెళ్ళేది? మా పని మనిషిని పెందలాడే రమ్మని చెప్పు. నేను బావిలో నీళ్ళన్నీ తోడి బయట పారబోసి బావి కడగాలి. నాకసలే బోలెడంత శు(భ్రం" అని అరిచింది.

అలా కాసేపు ఎవరినో అడ్డు పెట్టుకుని కసి తీర్చుకునేవారు.

వరాలు వచ్చాక దాని పుణ్యమా అని ఇద్దరికీ తృప్తిగా వుంటోంది. తాము అనాల్సినవన్నీ అనేయొచ్చు. కడుపులో దాచుకుని బాధపడనక్కరలేదు. అందుకే వరలక్ష్మికి తాయిలాలు పెట్టీ ముద్దు చేసీ నెత్తినెక్కించుకుంటున్నారు.

ఒకరోజు పొద్దున వెళ్ళేసరికి అనసూయమ్మ రాటా ముందు కూర్చుని మినపప్పు రుబ్బుతోంది.

"(శావణంలో పిన్నికి పెళ్ళి చెయ్యాలి వడియాలు పెట్టి వుంచితే మంచిది కదా!" అంది కాస్త పిండి వరాలు చేతిలో వేస్తూ.

"బాగానే వుంది సంబడం! ఈవిడగారు ఆర్భాటంగా వడియాలు పెట్టేసినంత మా(తాన పెళ్ళి కుదురుతుందా? చట్టి ముక్కు ఏ(బాసి మొహం దాన్నెవడు చేసుకుంటాడు. ఏ పుణ్యాత్ముడైనా కూతుర్ని చూసి సరే అన్నా తల్లి నోరు చూసి ఆమడ దూరం పారిపోతాడు" అంది కామేశ్వరమ్మ ఎగతాళిగా.

"అననీ అననీ. అన్నవాళ్ళ బుద్ధే బయటపడుతుంది గానీ పడ్డ వాళ్ళెప్పుడూ చెడ్డవాళ్ళు కాదు" అంది అనసూయమ్మ.

నెల రోజులు తిరక్కుండానే అన్నదమ్ములిద్దరూ ఊరు వెళ్ళి వచ్చారు.

## చివరి ఆత్మీయుడు

వీధిలో హఠాత్తుగా మొలిచీ
వీధంతా పారుతోన్న జనసము(ద్రం
మీంచి ఒక శవం కొట్టుకుపోతోంది.
ఉప్పొంగి లేస్తోన్న దుఃఖపు అలల్ని
గొంతు మధ్యన సమాధి చేసి
సము(ద్రం శవాన్ని మోస్తోంది.
పేగును కోసిచ్చిన పాపానికి
ఋణం తీర్చుకున్న బంధం దుఃఖా(శువుల
గుండె కోతలకు,
వీపెనుక వీపుల దుఃఖం మోతలకు
బరువెక్కిన గాలి సైతం
చితిమంటల వెలగనివ్వక ఆగలేదు.

విచి(త్రం–
సము(ద్రమెంత పెరిగినా
చితిమంటలారలేదు.
ఉన్నప్పుడే అంతా!
పోయే అప్పుడు
తీసుకుపోయేది ఎంతా?
శ్మశాన వైరాగ్యంతో
మెలిమెల్లిగా వెనుదిరిగిన
సము(ద్రపు అలలు,
అనురాగ బంధపు వలలు.

ఒంటరిగా శ్మశానంలో
చివరి ఆత్మీయుడు,
కాలుతోన్న శవాన్ని
క(రతో కావిలించుకుంటూ
కాటికాపరి.

–మునిమడుగుల రాజారావు

భోజనాల దగ్గర వివరాలన్నీ కొడుకులకి చెప్పాడు గోవిందయ్య.

అబ్బాయికి సర్వే డిపార్టుమెంటులో ఉద్యోగం. ఇద్దరు అన్నలు, ఒక అక్క అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇల్లూ వాకిలీ పొలం పుట్రా వున్నాయి. మర్యాదస్తులు. మంచివాళ్ళు. మంచి సంబంధం. వాళ్ళు మనతో సంబంధం కలుపుకునేందుకు ఆసక్తిగానే వున్నారు. వీలు చూసుకుని వచ్చి అమ్మాయిని చూసుకుంటాం, అన్నారు.

వివరాలు విని సంతోషించారు అందరూ. ఈ సంబంధం కుదిరితే వెంటనే పెళ్ళి చేయాలి. ఇంత కాలానికి మళ్ళీ మనింట్లో ఆడపిల్ల పెళ్ళి అన్నారు.

కామేశ్వరమ్మ మాత్రం ఏమీ మాట్లాడలేదు. విననట్లే వూరుకుంది. మరో పదిహేను రోజుల తర్వాత వారి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది.

ఫలాన రోజున పెళ్ళి చూపులకు వస్తామనీ, మీకూ అంగీకారం అయితే తెలియజేయమనీ రాశారు.

అన్నదమ్ములిద్దరూ చర్చించుకున్నారు. వారికి అంగీకారం తెలియజేశారు.

అప్పటి నుంచీ అనసూయమ్మకి మనస్సులో అలజడి ప్రారంభం అయింది. కూతురి పెళ్ళి అనేసరికి తల్లి ఆదుర్దా పడడం సహజమే.

కానీ అనసూయమ్మని అలజడికి గురిచేసిన సమస్య అదికాదు. వేరే వుంది.

ఆడపిల్ల పెళ్ళంటే సామాన్యం కాదు. ఏ వంకా లేకపోయినా వంకలు పెట్టి వద్దంటారు. ఇక్కడ తన విషయంలో పెద్ద వంకే వుంది. గుమ్మం ఎదురుగా వుండే తోటికోడలికి తనకు సఖ్యత లేదు. ఆ విషయం తెలిసి ఆ పెళ్ళి వాళ్ళేమనుకుంటారు? ఈ విషయం వాళ్ళకు తెలియకుండా దాచటం అసాధ్యం. ఏ గిట్టనివాళ్ళో చేరవెయ్యక మానరు.

అయిన వారితోనే విరోధం తెచ్చుకునే ఇంటి వారి అమ్మాయి మాకొద్దు అని వాళ్ళు అనుకుంటే ఎంత అప్రతిష్ఠ?

చూచాయగా ఆ సమస్యని భర్త ఎదుట వుంచింది.

''అవును నిజమే కానీ ఏం చేస్తాం? అందుకిష్టమైతే చేసుకుంటారు. కాదంటే మరో సంబంధం చూసుకుందాం!" అన్నాడాయన.

ఆవిడ గుండె గుభేలుమంది. అలా జరగడం ఆవిడకు సుతరామూ ఇష్టం లేదు.

ఎవరైనా కల్పించుకుని తమ ఇద్దిరకీ సంధి చేస్తారేమో అని ఎదురు చూసింది. కానీ ఎవరికీ ఈ గొడవ పట్టలేదు.

ఏం చెయ్యాలో తెలియక వరలక్ష్మి దగ్గర తన బాధ వెళ్ళబోసుకుంది.

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఏం చెయ్యను?" అంది దీనంగా.

అది విని రుసరుసలాడింది కామేశ్వరమ్మ. "అవున్లే తనదాకా వస్తే గానీ తెలియదని నా ఇంట్లో శుభకార్యాలకి ఆవిడ గారెంత యాగీ చేసిందో నాకింకా జ్ఞాపకమే. మరి నవ్వుతూ చేస్తే ఏడుస్తూ అనుభవించక తప్పుతుందా?" అంది చిరాగ్గా.

అది విని మరీ క్రుంగిపోయింది అనసూయమ్మ.

ఇక లాభం లేదు. ఈ సమస్య తను వంటరిగా పరిష్కరించుకోవాల్సిందే. ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంది.

సాయంత్రం తోటి కోడలింటికి వెళ్ళి ఆవిడతో మాట్లాడాలని నిర్ణయించుకున్నట్టు తెలియజేసింది.

వరలక్ష్మి గుండె ఠారుమంది. పెద్దమ్మమ్మ చిన్నమ్మమ్మ మాట్లాడుకుంటారా? ఎలా ప్రళయం రాదూ??? ఎందుకంటే "అది నా కంట పడితే కాళ్ళు విరిచి పొయ్యిలో పెడతాను అంది పెద్దమ్మమ్మ ఎన్నోసార్లు."

"ఆవిడ నా జోలికి వస్తే మొహాన పేడ నీళ్ళు కొడతాను" అంది చిన్నమ్మమ్మ లెక్క లేనన్నిసార్లు. మరిప్పుడు వాళ్ళిద్దరూ కలుసుకుంటారు? ఏమవుతుంది? చెప్పలేనంత ఆదుర్దాతో తెల్లవారిన దగ్గర్నుంచి అటు నుంచి ఇటూ ఇట్నించి అటూ తిరుగుతూనే వుంది.

ఊళ్ళో అందరికీ కూడా తెలిసిపోయింది. వరలక్ష్మిలా పైకి చెప్పకపోయినా అందరికీ ఏదో మూల ఆదుర్దా.

ఏం జరుగుతుంది. ఇద్దరూ జుట్టూ జుట్టూ పట్టుకుంటారా. వరలక్ష్మి పెద్దమ్మమ్మనీ

చిన్నమ్మమ్మనీ వాళ్ళ వాళ్ళ మాటలు గుర్తు చేసి మరి నువ్వు కాళ్ళు విరగ్గొడతావా? నువ్వు పేద నీళ్ళు జల్లుతావా అని అడిగింది. ఇద్దరూ కసిరారు. అంతేకాదు వరలక్ష్మి తోనూ ముభావంగానే వున్నారు.

సాయంత్రం నాలుగు గంటలు అయింది.

మాధవయ్య ఇంట్లో దొడ్డివైపు అరుగు మీద కూర్చుని వున్నారు మాధవయ్య, కామేశ్వరమ్మ, శ్యామల, పిల్లలు.

కుంపటి వెలిగించి కాఫీ కోసం నీళ్ళు పడేసింది కామేశ్వరమ్మ. గేటు శబ్దం అయింది.

శ్యామల తొంగి చూసింది. "పిన్ని వచ్చింది" అంది మెల్లిగా. వరలక్ష్మి గుండె ఠారుమంది.

కుంపటి విసురుతున్న కామేశ్వరమ్మ మరింత విసురుగా విసరసాగింది. సింహద్వారం దగ్గర నిలబడి "అక్కయ్యా అక్కయ్యా" అని పిల్చింది అనసూయమ్మ.

తల్లి సమాధానం చెప్తుందేమో అని ఒక్క నిముషం ఎదురుచూసిన శ్యామల ఆవిడ విననట్టే వూరుకోవడంతో "ఇక్కడ వున్నాం రా పిన్నీ" అంది ఆదరంగా.

మెల్లిగా ఇల్లంతా దాటుకుని లోపలికి వచ్చింది అనసూయమ్మ బావగారిని చూసి కొంగు భుజం చుట్టూరా కప్పుకుని వచ్చి అరుగు కింద తాటాకుల పందిరి గుంజకి ఆనుకుని కూర్చుంది.

కుంపటి మీద నీళ్ళు మరిగాయి. గిన్నె దించి కాఫీ పొడి వేసి చన్నీళ్ళు చిలకరించి మూతపెట్టి, పాల గిన్నె కుంపటి మీద పెట్టింది కామేశ్వరమ్మ.

''బావున్నావా అక్కయ్యా'' అంది అనసూయమ్మ.

ఆవిడ సమాధానం చెప్పలేదు. ముఖం ఇంత చేసుకుని వూరుకుంది. కాసేపు ఆగి "శ్రీలక్ష్మిని చూసుకునేందుకు పెళ్ళివారు వస్తున్నారు. పెద్దదానివి. నీ చేతుల మీదుగా ఈ శుభకార్యం జరిపించాలి" అంది కామేశ్వరమ్మ.

"నా పెద్దరికం పేలాలు వేగినట్లే వుంది. ఈ కొంపకి పెద్ద కోడలిగా వచ్చినది మొదలు పనులూ చేశాను చెప్పుదెబ్బలూ తిన్నాను. అయినా మీ అంతటి వాళ్ళు మీరయ్యాక నా పెద్దరికం ఎందుకు. పెళ్ళివేల్టికి వచ్చి నాలుగక్షింతలు వేస్తాను" అంది కామేశ్వరమ్మ.

"నువ్వట్లా అంటే నేనేం చెప్పను? చిన్నవాళ్ళం మేము తప్పులు చేసినా పెద్దవాళ్ళు పెద్ద మనసుతో క్షమించాలి. తల్లిలాటి దానివి నువ్వు. నువ్వు కాకపోతే నన్ను ఎవరు ఆదరిస్తారు? అయినవాళ్ళ మధ్య మాటామాటా రావా? నేను తోటి కోడలిని కాబట్టి ఇట్లా అంటున్నావు. ఇదే నీ తోడబుట్టిన చెల్లెలే వచ్చి అడిగితే ఇదే మాట అనేదానివా?" అంటూ కొంగుతో కళ్ళు తుడుచుకుంది అనసూయమ్మ.

## గుండె చప్పుళ్ళు

గుండె చప్పుళ్ళు
లబ్బుడబ్బుల ధ్వని
కోటీశ్వరుడు!

గుండె చప్పుళ్ళు
ప్రేమాటల సయ్యాట
పెళ్ళికూతురు!

గుండె చప్పుళ్ళు
బాధ్యతల లిస్టులు
పెళ్ళికొడుకు!

గుండె చప్పుళ్ళు
రసస్పందన ప్రేగు
కవి మనసు!

గుండె చప్పుళ్ళు
కృషి కృషి కృషిగా
కృషీవలుడు!

గుండె చప్పుళ్ళు
ఆత్మీయతా స్పర్శలు
అమ్మ మనసు!

గుండె చెప్పుళ్ళు
నోట్ల కట్టల లెఖ్ఖ
ధనవంతుడు!

గుండె చప్పుళ్ళు
కష్టార్జితం తృప్తిగా
కార్మిక లోకం!

–జి. శైలూషి

కామేశ్వరమ్మ కూడా కళ్ళు వత్తుకుంది.

పొంగువచ్చిన పాల మీద నీళ్లు చిలకరించి గిన్నె కిందికి దింపింది. గుడ్డతో డికాషను వడగట్టి కాఫీ కలిపి గ్లాసుల్లో పోసింది.

"శ్యామలా పిన్నికి కాఫీ ఇవ్వవే" అని కూతుర్ని పురమాయించింది.

కాఫీ తాగి వాకిట్లోకి వెళ్ళిపోయాడు గోవిందయ్య.

"నువ్వు కాఫీ కలిపితే అమృతంలా వుంటుంది అక్కయ్యా? ఎన్నాళ్ళయిందో నీ చేతి కాఫీ తాగి" అంది అనసూయమ్మ.

"శ్యామలా ఇంకాసిని కాఫీ ఇవ్వు పిన్నికి" అంది కామేశ్వరమ్మ. శ్యామల ఇంకొంచెం కాఫీ గ్లాసులో పోసింది.

"అక్కయ్యా, వాళ్ళు వచ్చేసరికే సాయంత్రం అవుతుందిట. మరి అప్పుడు పెళ్ళిచూపులు చూస్తారా?" అంది చిన్నావిడ.

"ఇంకా నయం. అసుర సంధ్యవేళ ఆడపిల్లని చూపిస్తామా?? ఆ పూట ఇక్కడ వుంటారు. గుడీ గోపురం చూస్తారు. తెల్లవారాక పెళ్ళి చూపులు చూపిద్దాం" అంది పెద్దావిడ.

"మరి సాయంత్రం ఫలహారం, రాత్రి భోజనం, పొద్దున ఫలహారం?" అడిగింది చెల్లెలు.

"అక్కడ వద్దులే కతికితే అతకదంటారు. ఆ ఏర్పాట్లన్నీ ఇక్కడే చేయిద్దాం" అంది అక్కగారు.

"ఏమో బాబూ అవన్నీ నువ్వే చూసుకోవాలి" అంది చిన్నావిడ గారంగా.

"నేను కాకపోతే నువ్వు చూసుకుంటావా? నీకా మాత్రం తెలివితేటలు కూడానా" అంది పెద్దావిడ మురిపెంగా.

ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

ఇక నేను వెళ్తాను అని లేచింది అనసూయమ్మ.

"మనం ఇంత చేస్తున్నాం. వాళ్ళకి మనమ్మాయి నచ్చుతుందో లేదో!" అంది దిగులుగా.

"ఇంకా నయం! మనమ్మాయికేం తక్కువా. మహలక్ష్మిలా వుంటుంది. దాన్ని చేసుకునేవాడు అదృష్టవంతుడు" అంది కామేశ్వరమ్మ.

మర్నాడు తెల్లవారి మరిది ఇంటికి వెళ్ళింది. "ఏమిటే ఈ ఇల్లు? ఇట్లాగేనా వుంచుకునేది? ఎంతసేపూ దడదడా పనిచేసి పారేసి పేపరు కాయితం చదవడం, లేకపోతే వూరి మీద పడి అంగలం తిరగడం తప్పించి ఇంటి ధ్యాసే లేదు నీకు" అని తోటి కోడలిని చీవాట్లు పెట్టింది.

అదేవిటో తనకు సన్మానం చేసి శాలువా కప్పినంత సంతోషపడిపోయింది అనసూయమ్మ.

తన పరికరాలన్నీ తీసుకుని సపరివారంగా వచ్చి మరిది ఇల్లు శుభ్రం చేయించే బాధ్యత నెత్తిన వేసుకుంది కామేశ్వరమ్మ.

అదేకాదు. అరిసెలు జంతికలూ కూడా చేసింది. ఊరికి వెళ్తానని బయలుదేరిన శ్యామలను శ్రీలక్ష్మిని ముస్తాబు చెయ్యాలంటే నువ్వంటే బావుంటుంది. ఆ నాజూకు పనులు మా చేతకావు అని చెప్పి ఆపేసింది.

తెల్లవారితే పెళ్ళి వారు వస్తారు. ఆ పూట అందరూ మాధవయ్య ఇంట్లోనే భోజనం చేశారు. తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"ఒసే అనసూయా. నీకసలే బద్ధకం. అలవాటు ప్రకారం గోరంచు చీరె కట్టుకుని వేలు ముడి వేసుకుని తయారయ్యేవు. వాళ్ళ ముందు నాసిగా వుంటావు. దర్జాగా తయారవ్వు" అంది కామేశ్వరమ్మ.

"పోనీ ఓ పని చెయ్. శ్రీలక్ష్మిని శ్యామల ముస్తాబు చేస్తుంది. నన్ను నువ్వు ముస్తాబు చెయ్యి" అంది అనసూయమ్మ.

అంతా గొల్లున నవ్వేరు.

వరలక్ష్మికి వీళ్ళ వ్యవహారం చూస్తుంటే ఒళ్ళు మండుకొస్తోంది. వాళ్ళిద్దరికీ సఖ్యత కుదిరాక వరలక్ష్మి ప్రాముఖ్యత తగ్గిపోయింది. పదవి కోల్పోయిన అధికారిలా అయిపోయింది. దాంతో ఉక్రోషం వచ్చేసింది.

"అప్పుడేమో కొట్టుకుంటాం తిట్టుకుంటాం అన్నారు. ఇప్పుడిలా నవ్వుకుంటూ తిరుగుతున్నారు. మీ వ్యవహారం నాకేం నచ్చులేదు" అంది నాపసానిలా, నడుమున చేతులు పెట్టుకుని.

"చాల్లే వూరుకో భడవ కానీ" అన్నారు తోడి కోడళ్ళు ఇద్దరూ ముక్త కంఠంతో. ■